క్లుప్తంగా

ఐటీఐలో దరఖాస్తు చేసుకోండి

తొండూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ అడ్మిషన్ కౌన్సిలింగ్‌కై అర్హులైన 10వ తరగతి పాసైన వారు ఐటీఐకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తొండూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల నందు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఐటీఐలో సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్, మెకానిక్, డీజిల్ మెకానిక్ ట్రేడులు కలవన్నారు. ఇతర వివరాలకు 9989356928, 8639191848 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముద్దనూరు : మండల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ తెలిపారు. మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

జమ్మలమడుగులో వర్షం



చిన్నపసుపలలో కురుస్తున్న వర్షం

జమ్మలమడుగు : పట్టణం చుట్టూ ఉన్న ప్రాంతాలలో మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం ఆకాశం ఒక్కసారి మేఘావృత్తమై మెరుపులు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దాదాపు గంట సేపు వర్షం కురవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. వంకలు పొంగిపోర్లాయి. దీంతో రామిరెడ్డిపల్లె, పెద్దపసుపల రైల్వే బ్రిడ్జిల కింద నీరు వచ్చిచేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కమలాపురంలో..



జలమయమైన కుమ్మర వీధి

కమలాపురం : మండలంలో నైరుతి రుతు పవనాల ప్రవేశంలో నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో భాగంగా కమలాపురంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి లొతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షం నీరు నిలవడంతో పాదాచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. వేసవి కాలం అంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు ఉక్క పోత కూడా తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఇటు ప్రజలు, అటు రైతులు ఉపశమనం పొందుతున్నారు. వరుణుడు కరుణించాడని, ఒక పంటలు సాగు చేయాలని రైతులు సిద్ధం అవుతున్నారు.

జిల్లా విద్యార్థులకు ఇంటాక్ 'రీజినల్' బహుమతులు



విజేతల వివరాలను ప్రకటిస్తున్న చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : జిల్లా విద్యార్థులకు ఇంటాక్ రీజినల్ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలో బహుమతులు లభించాయని సంస్థ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ఇటీవల ఢిల్లీలోని ఇంటాక్ కేంద్ర కార్యాలయం 'మై మాన్యుమెంట్ సెర్చ్' పేరిట విద్యార్థులకు ఈ పోటీ నిర్వహించిందన్నారు. దేశ వ్యాప్తంగా వంద నగరాల్లో ఈ పోటీకి 12 వేల మంది హాజరయ్యారన్నారు. కడపలో జరిగిన పోటీలో 110 మంది పాల్గొన్నారని, ఇందులో నగరానికి చెందిన విద్యామందిర్ ఇంగ్లీషు మీడియం హైస్కూలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఆర్.మహాలక్ష్మి, 9వ తరగతి విద్యార్థి బి.దీక్షిత, స్థానిక బాల వికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలుకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఎస్.జియోన్ ప్రణుతి రీజినల్ స్థాయి బహుమతి సాధించినట్లు తెలిపారు. వారం రోజుల్లో ఆయా పాఠశాలల్లో విజేతలకు ఈ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

ఐక్యవేదిక అధ్యక్షుడిగా జయరాం

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ కడప నగర అధ్యక్షులుగా మాసాపేటకు చెందిన గున్నా జయరాంను నియమించినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి తమ పార్టీకి సంబంధించి వార్డు, గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

సెంట్రల్ బోలేవార్డులో ట్రాఫిక్ సమస్య





బోలే వార్డులో భారీ వాహనాలు వెళుతుండటంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పులివెందుల టౌన్ : పులివెందుల సెంట్రల్ బోలే వార్డులో ట్రాఫిక్ సమస్యగా మారింది. పోలీసులు, ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు మే నెల 27 నుంచి వన్‌వే పద్ధతి ప్రకారం బస్సులను నడపాలని ఆదేశాలు జారీ చేశారు.

అయినప్పటికీ వారి ఆదేశాలను లెక్కచేయకుండా భారీ వాహనాలను సైతం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా బోలేవార్డుకు రావడంతో పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు, ప్రైవేట్ బస్సులు సైతం పట్టణంలోకి రావడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు మాత్రం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వన్‌వే పద్ధతిలో వాహనాలు వచ్చే విధంగా ట్రాఫిక్‌ను కట్టడి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం

– వైఎస్ మధురెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్ మధురెడ్డి

పులివెందుల రూరల్ : వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘర్షణలకు దిగుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదని తొండూరు మండల వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సింహాద్రిపురం మండల కేంద్రంలో అబ్బాస్ అనే వైఎస్సార్సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు పాత విషయాలు మనసులో పెట్టుకుని దాడి చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయం పాటించి ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం మార్కెట్‌యార్డ్ చైర్మన్‌లు చిన్నప్ప, రామ్మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ వైఎస్సార్సీపీకి చెందిన నాయకులు గొడవలను, ఘర్షణలను ప్రోత్సహించేవారు కాదన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, ఐదు సంవత్సరాలకు ఒకసారి మారుతూ ఉంటాయన్నారు. ఈ సమయంలో పార్టీల కార్యకర్తలపై దాడులు చేయడం, ఇళ్ల వద్దకు వెళ్లి గొడవలు చేయడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు.

ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యం



వేములలో నూతన బ్రాంచ్ భవనాన్ని ప్రారంభిస్తున్న జోనల్ హెడ్ భాస్కర్‌రావు, లక్ష్మితులసీలు

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించడమే యూనియన్ బ్యాంకు లక్ష్యమని జోనల్‌హెడ్ భాస్కర్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన వేములలో శుక్రవారం రీజనల్ హెడ్ లక్ష్మితులసితో కలిసి ఆయన యూనియన్ బ్యాంకు బ్రాంచ్ నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే 5వ అతిపెద్ద బ్యాంకుగా యూనియన్ బ్యాంకు విస్తరించిందన్నారు. రాష్ట్రంలో రెండు జోనల్ కార్యాలయాల ద్వారా సుమారు 1100లకు పైనే బ్రాంచ్‌లను యూనియన్ బ్యాంకు కలిగి ఉందన్నారు. బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అన్ని రకాల సేవలను అందిస్తున్నామన్నారు. ఖాతాదారులే బ్యాంకు దేవుళ్లని, వారికి మెరుగైన సేవలు అందించడం ద్వారా బ్యాంకు కార్యకలాపాలు పెరుగుతున్నాయన్నారు. బ్యాంకులో ఖాతాదారులకు విద్య, హౌసింగ్, పంట రుణాలను విరివిగా ఇస్తున్నామన్నారు. ప్రతి ఖాతాదారునికి రూ.7.50లక్షల వరకు ఎలాంటి గ్యారంటీ లేకుండానే రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. వేములలో బ్రాంచ్ ప్రారంభించిన రెండేళ్లలో బ్యాంకు కార్యకలాపాలు విస్తృతంగా పెరిగాయన్నారు. బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీతో రుణాలను ఇస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు రూ.20లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. వేముల బ్రాంచ్‌లో ఈ ఏడాది ఖరీఫ్ నుంచి రూ.60 కోట్ల మేర కార్యకలాపాలు జరిగేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ రాజ్‌కుమార్, నాగార్జున, బ్రాంచ్ మేనేజర్ నరేంద్ర, ఎర్రగుంట్ల బ్రాంచ్ మేనేజర్ నాగిరెడ్డి, నాగులగుట్టపల్లె బ్రాంచ్ మేనేజర్ సురేష్, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిబిరాలు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న వెంకటసుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డిలు

వేంపల్లె : మే 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు గ్రంథాలయ వేసవి శిబిరాలు నిర్వహించినట్లు వేంపల్లె శాఖ గ్రంథాలయ అధికారిణి వనజకుమారి తెలిపారు. శుక్రవారం ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. వేసవికాలంలో విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లు చూడకుండా గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేస్తే మంచి జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. వివిధ రకాల కాంపిటీషన్ పరీక్షలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వేసవి శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక సమీక్ష, పుస్తక పఠనం, వకృత్వ పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డిల చేతుల మీదుగా విజేతలుగా నిలిచిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగులు ధర్మారెడ్డి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజలకు మంత్రి పదవులు కేటాయించాలి

కడప రూరల్ : రాష్ట్రంలో ఏర్పాటు కానున్న తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి మంత్రివర్గంలో బలిజలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని బలిజ సేన రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో మెజార్టీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడంలో పవన్ కల్యాణ్, బలిజలు పెద్దన్న పాత్ర పోషించారని అన్నారు.

ఈ నేపథ్యంలో బలిజలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు మంత్రి పదవులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు మురళీకృష్ణ, కేఎస్‌నరసింహా, రాష్ట్ర మహిళా కార్యదర్శి రెడ్డి రాణి, అనంతరాయలు, సుంకర రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి క్షేత్రాన్ని దర్శించుకున్న ఆర్‌డీఓ



ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్‌డీఓ మధుసూదన్

వల్లూరు : మండలంలోని పుష్పగిరి క్షేత్రాన్ని కడప ఆర్‌డీఓ మధుసూదన్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షిత్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆర్‌డీఓకు పూజా కైంకర్యం నిర్వహించారు. అలాగే దక్షిణ కాశీగా పిలవబడుతున్న పుష్పగిరి క్షేత్రం గురించి, అలాగే అందులో వెలసి ఉన్న స్వాముల వారి గురించి ఆర్‌డీఓకు అర్చకులు తెలియజేశారు. అనంతరం ఆర్‌డీఓకు శాలువ కప్పి, పూల మాలతో సత్కరించారు.

వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు వరం



ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

కడప కల్చరల్ : వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు వరం లాంటివని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ గ్రంథాలయాలలో శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల ముగింపు సందర్భంగా శుక్రవారం కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రధాన కార్యాలయంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అమీరుద్దీన్ మాట్లాడుతూ ఈ శిబిరం విజయవంతం అయ్యేందుకు రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన జన విజ్ఞాన వేదిక నాయకులు, గ్రంథాలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ శిబిరాల ప్రయోజనం, విలువ గురించి విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా ఆయన శిబిరంలో చిన్నారుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జేవీవీ సాంస్కృతిక విభాగం ప్రతినిధి రంగనాయకులు లలిత గీతాల ద్వారా శాస్త్ర విజ్ఞానం గురించి తెలియజేయగా, సుబ్రమణ్యం గణితం విలువ, గణితాన్ని సులభంగా నేర్చుకోవడాన్ని గురించి వివరించారు. జేవీవీ జిల్లా ఆర్థిక కార్యదర్శి సమీర్ పలు మేజిక్ అంశాలను ప్రదర్శించారు. శిక్షణా శిబిరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రంథాలయంలో ఉచితంగా సభ్యత్వం ఇవ్వడంతోపాటు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిత్రలేఖన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, గ్రంథాలయ అధికారులు పవన్‌కుమార్, నాదెండ్ల బాబ్జి, జేమ్స్, సురేష్, సుబ్రమణ్యం, రాంప్రతాప్ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి చేయూత ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడే ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధితోపాటు విద్యా పరిరక్షణకు కృషి చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. శుక్రవారం కడపలోని ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం మోగా డీఎస్సీ ప్రకటిస్తూ మొదటి సంతకాన్ని చేయాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 28 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీవో 117 కారణంగా రాష్ట్రంలో 12 వేల పాఠశాలల్లో సింగల్ టీచర్ స్కూల్‌గా మారిపోయినందున విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఉన్నత పాఠశాలలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లు ఉండే విధంగా తగు నిర్ణయం ప్రకటించాలని కోరారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే పాఠశాలగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆదే విధంగా మెరుగైన పీఆర్సీ, ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. రాష్ట్రమంతా విద్యార్థులకు ఒకే సిలబస్ ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుపాకుల మురళి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, కొప్పూరి నాగరాజు, శ్రీరాములు, సలాంతోపాటు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మలేరియాతో తస్మాత్ జాగ్రత్త



గ్రామాల్లో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారులు

పులివెందుల రూరల్ : మలేరియా జ్వరం అంటేనే గ్రామాల్లో చాలామంది ప్రజలు వణికిపోతారు. నెలల తరబడి జ్వరం పీడిస్తూ ఉండటమే ఇందుకు కారణం. వ్యాధి సోకిందంటే వెంటనే వద లదు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే ప్రమా దం కూడా ఏర్పడుతుంది. సంబంధిత వైద్యాధికారులు మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

మలేరియా లక్షణాలు

మలేరియా అనాఫిలిస్ అనే దోమకాటు వల్ల వస్తుంది. వర్షాకాలంలో దోమలు పెరిగే ప్రదేశాల్లో ఎక్కువ అవడం వల్ల ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, కడుపులో నొప్పి, జ్వరం మూడురోజులకు ఒకసారి రావడం వంటి లక్షణాలు ఉంటాయి.

నిర్ధారణ

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ గంటలోపే చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్విన్, ప్రైమోక్విన్ అనే మాత్రలను ఇస్తారు. ఇవి రెండు రోజులు ఆపకుండా వాడాలి.

దోమలు పెరుగకుండా జాగ్రత్తలు

ఇంటి పరిసరాలలో దోమలు పెరగకుండా ఉండేందుకు మంచినీటి నిల్వలు లేకుండా చూడాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. డ్రై డే పాటించాలి. ఖాళీ కొబ్బరి చిప్పలు, కొబ్బరి బోండాలు, పాతటైర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమలు ఇళ్లలోకి రాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు.

ఉచిత వైద్య సేవలు



పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసి మందులను ఉచితంగా అందజేస్తున్నారు. మలేరియా జ్వరం ఎక్కువగా ఉన్న వారిని ఆసుపత్రిలోనే అడ్మిట్ చేసి వైద్యం అందిస్తున్నారు. ప్రజలు సీజన్‌లో ఈ వ్యాధి భారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తూ కరపత్రాలను కూడా పంపిణీ చేస్తున్నాం.

– మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపులేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్, రాయలసీమ అధ్యక్షుడు నాగరాజ్‌లు కోరారు. ఈ విషయమై శుక్రవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 శాతం సీట్లను ఇవ్వాలని జీఓ ఉన్నా కొన్ని విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. కొన్ని పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.3 వేల నుంచి రూ.5 వేలు రాబడుతున్నారన్నారు. వీటిన్నింటిపై విచారణ జరిగి చర్యలు తీసుకోవాలని కోరారు.

లింగ వివక్ష విడనాడాలి



మైదుకూరులో లింగ వివక్షపై అవగాహన ర్యాలీ

మైదుకూరు : సమాజంలో ప్రతి ఒక్కరూ లింగ వివక్షను విడనాడాలని ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. మైదుకూరు పట్టణం, మండలంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లింగ వివక్ష నిర్మూలన, లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మైదుకూరు పట్టణంలోని అంగన్‌వాడీ–6 కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ ఆడ పిల్లలు లేని సమాజాన్ని ఊహించుకోవడం కష్టమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడి ఆడ పిల్లలను తల్లి గర్భంలోనే చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టబోయే బిడ్డ ఆడో మగో చెప్పే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. లింగ వివక్షను పాటించకుండా ఆడ పిల్లలను పుట్టనివ్వాలని, వారిని చదవనివ్వాలని, ఎదగనివ్వాలని పిలుపునిచ్చారు.

మండలంలోని వనిపెంట సెక్టార్ పరిధిలో విశ్వనాథపురం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం, జీవీ సత్రం సెక్టార్ పరిధిలోని తువ్వపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పోరుమామిళ్ల : చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు ఊహించని విధంగా వచ్చాయని, వైఎస్సార్‌సీపీ 5 సంవత్సరాల పాలనలో ప్రజలకు ఎంతో సేవ చేసిందని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిందని అయినా ఓటమి పాలు కావడం నివ్వెరపాటుకు గురిచేసిందన్నారు.

దీంతో నా పదవి కి రాజీనామా ఇచ్చానని ఆయన అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల వల్ల రాష్ట్రం అప్పుల పాలైందని, త్వరలో శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు అంతకు రెట్టింపు పథకాలు అమలు చేస్తానని ఎన్నికల్లో మాట ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జులై 1న అవ్వాతాతలకు రూ.7 వేలు, ప్ర తి నెల రూ.4 వేలు ఇవ్వాలని, బస్సుల్లో మహిళల కు ఉచిత ప్రయాణం, ఇంట్లో బిడ్డలందరికీ అమ్మ ఒ డి, 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, ప్రతి ఇంటికి ఉ ద్యో గం, నిరుద్యోగ భృతి ఇలా 25 హామీలు ఇచ్చారని వాటిని అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. అప్పుడు మా పార్టీ కూడా మద్దతు ఇస్తుందన్నారు.

వర్షపునీరు రోడ్లపై నిలవకుండా చర్యలు



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: వర్షపునీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. 23వ డివిజన్ నాగరాజుపేట సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికుల హాజరును స్వయంగా పరిశీలించారు. కార్మికులంతా నూతనంగా ఇచ్చిన యూనిఫారం ధరించాలని సూచించారు. గురువారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్న నేపథ్యంలో రహదారులపై నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయల్ థియేటర్ వద్దనున్న గార్బేజ్ పాయింట్లను తొలగించాలని సూచించారు. అనంతరం జువెనైల్ హోంను సందర్శించిన కమిషనర్ టాయిలెట్స్‌ను పరిశీలించి పాడైపోయిన కుళాయిలను వెంటనే మార్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హోంలోని పిల్లలకు సంబంధించి అవసరమగు వసతులను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని డివిజన్లలో కాలువల్లో ఫాగింగ్ తో పాటుగా అబేట్ స్ప్రేయింగ్ చేయించాలన్నారు. 35వ డివిజన్ నకాష్‌లో కాలువ ఓవర్ ఫ్లో అవుతుండటాన్ని పరిశీలించి, పూడిక తీయించాలని ఆదేశించారు. అడ్డుగా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలన్నారు. 50వ డివిజన్ దండు ప్రాంతంలో పిచ్చి మొక్కలను, రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ స్ట్రీట్ ఎంట్రెన్స్‌లో కాలువలో ఉన్న మట్టిని తొలగించాలన్నారు. అనంతరం సీకే దిన్నె పరిధిలోని గోశాలను పరిశీలించి మేత కొరకు ఆవులను బయటికి తీసుకుపోవాలన్నారు. గోశాల వనం చుట్టూ రాళ్లతో పాత్ వే నిర్మించి, చెరువులాగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్, శానిటేషన్, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.